## మతిభ్రమించిన మాటలు మానుకోవాలి




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 361 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 24 డిసెంబర్ 2025

## మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి




# తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్

● అన్ని శాఖలకు సంబంధించి పాలసీ ● క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు ● ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట ఉద్యోగుల వివరాలు ఇవ్వండి ● అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించండి ● అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు



**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ మిగతా2లో...



## అక్రమ వలసదారులకు ట్రంప్ గాలం

స్వచ్ఛందంగా అమెరికా వీడే వారికి 3వేల డాలర్ల తోఫా

విమాన ప్రయాణం కూడా ఉచితమే

**వాషింగ్టన్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రమ వలస దారులను దేశం నుంచి పంపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వారికి గతంలో ప్రకటించిన ఓ ఆఫర్‌ను భారీగా పెంచింది. అమెరికా మిగతా2లో...

## ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్

- 4న సమావేశం ఏర్పాటు: కవిత



**యాదాద్రి,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనవరి 4న ఎనమిది జిల్లాల్లోని ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్ మిగతా2లో...

## శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

● వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు ● దర్శనాల్లో సామాన్య భక్తులకే పెద్ద పీట ● తొలి మూడు రోజులు టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం ● చివరి ఏడు రోజుల్లో సర్వ దర్శనం ● టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్




## కెసిఆర్ ధోరణి మార్చుకో...

■ తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు ■ అలాంటి వారికి ప్రజలే బుద్ది చెబుతారు ■ ఘాటుగా స్పందించిన డిప్యూటి సిఎం భట్టి



**ఖమ్మం,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. శాసనసభకు వచ్చే ధైర్యం లేని వారు, బయట ఉండి అడ్డగోలుగా మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. మిగతా2లో...

## 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా యూరియా యాప్

- యాప్ పనితీరు పట్ల రైతులు సంతృప్తి
- రెండురోజుల్లో యాప్ ద్వారా 60,510 బస్తాలు కొనుగోలు
- త్వరలో అన్ని జిల్లాలలో అమలుకు సన్నాహాలు



**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయశాఖ ద్వారా ప్రవేశపెట్టిన యూరియా యాప్ 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా గత రెండ్రోజుల నుండి పరిశీలించడం జరిగిందని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందని మంత్రి తుమ్మలనాగేశ్వర రావు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 మరియు పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. మిగతా2లో...



## న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

మద్యం తాగా డ్రైవింగ్ చేస్తే పదివేల జరిమానా

అధికారులతో సమీక్షించిన కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**నూతన సంవత్సరం సందర్భంగా భాగ్యనగరంలో పలు ఆంక్షలు విధిస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హద్దు మీరితే మిగతా2లో...

## దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

నామినేటెడ్ పద్ధతిలో భర్తీకి సర్కార్ యత్నం

ఓటు వేసే సమయమొస్తే రైతులు కర్రుకాల్చి వాతలకు సిద్ధం

నల్లగొండలో సర్పంచ్‌లతో సమావేశంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



**నల్లగొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక, ప్రజలకు ముఖం చూపించలేక సహకార ఎన్నికల నిర్వహణ నుంచి తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పద్ధతిలో 'సహకార' పదవులు నింపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఓటేసే అవకాశం ఇస్తే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయయని అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా ప్రభుత్వం భయంతోనే వాయిదా వేస్తోందని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో సర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తూ.. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్న ట్టు.. మన దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడేది లేదని, నల్లగొండ, మహబూబ్‌నగర్ రైతాంగానికి న్యాయం జరిగే వరకు మన పోరాటం ఆగవద్దని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మంత్రులకు సాగునీటిపై కనీస అవగాహన లేదని, మిగతా2లో...



## సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

- పంచాయితీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష

**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు.. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మిగతా2లో...

## గ్రామాలకు ఇక పల్లెవెలుగు ఎలక్ట్రిక్ బస్సులు

ఆర్టీసి అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులు కూడా ఎసితో కూడా ఇవి బస్సులను సిద్ధం చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఇకపై కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'ప్లలెవెలుగు'కు మిగతా2లో...

## రవాణాశాఖ డిప్యూటి కమిషనర్ కిషన్ నాయక్ అరెస్ట్

- రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తుల గుర్తింపు



**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రవాణాశాఖ మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఉదయం 5గంటల నుంచి సోదాలు నిర్వహించిన అధికారులు రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు, మిగతా2లో...

# కెసిఆర్ ధోరణి మార్చుకో...

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ.12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యతతో ఉంది. గతంలో ఏ రాజకీయ పార్టీని కూడా ప్రజలు ఇంత పెద్ద ఎత్తున దీవించలేదు. ఇందిరమ్మ రాజ్యం ప్రజల పక్షాన నిలబడటం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా మాకు మద్దతు ఇస్తున్నారు అని ఆయన వివరించారు. ముఖ్యంగా 65 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన 'తోలు వలుస్తాం' అనే వ్యాఖ్యలను భట్టి తీవ్రంగా ఖండించారు. తోలు తీసుకునే ఉద్యోగం నువ్వు ఎప్పుడు తీసుకున్నావు కేసీఆర్? పదిమందిని కూర్చోబెట్టుకొని తోలు వలుస్తానంటే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరు. నువ్వు అడ్డగోలుగా మాట్లాడినా, మేము మాత్రం దిగజారి ప్రవర్తించము. మా అభివృద్ధి చాటల ద్వారానే మీకు సమాధానం చెబుతాం' అని భట్టి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. సభకు వచ్చే ధైర్యం లేకనే బయట ఉండి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.గతంలో జరిగిన ఎన్నికలకు, ఇప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని, అందుకు ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను ప్రజలు ఇచ్చారని, ఇప్పటికైనా కేసీఆర్ తన ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సి ఒది పోయి, విమర్శలకే పరిమితం కావడం ప్రతిపక్షాలకు తగదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు

# ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. బీబీ నగర్ లోని ఎయిమ్స్ ను ఆమె సందర్శించారు. అనతంరం కవిత మాట్లా డుతూ.. రైతులను జైలును పంపించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఆ ప్రభుత్వంలో నేను ఉన్నాను. నాకు తెలియదు కావున నేను రాయగిరి రైతులను క్షమాపణలు కోరుతున్నాను. రాయగిరి రైతులు ఇప్పటికే చాలాసార్లు భూములు ఇచ్చి ఉన్నారు. కావున అలైన్మెం ట్ మార్చాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతా.. కేంద్రమంత్రి గడ్కరీని కలుద్దాం అని అన్నారు. పెద్దల భూములు కాపాడేందుకు చిన్న సన్నకారు రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. మరోవైపు ఎయిమ్స్ లో ఎమర్జెన్సీ మెడిసిన్ దొరకే పరిస్థితి లేదన్నారు. అన్నారు. భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ల అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎంపీలు, ఎమ్మెల్యేలు దృష్టి సారించి ఎయిమ్స్ కాంట్రాక్టర్లు ఒత్తిడి తెచ్చిన నిర్మాణా లు పూర్తి చేయాలన్నారు.

# మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని సిఎం అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశా నికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** తిరుమల శ్రీవారి ఆలయంలో 30 తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రం చేశారు. ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టీటీడీ చేసిన ఏర్పాట్ల గురించి ఈవో మాట్లాడుతూ డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల కోసం పగడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా అధికార యంత్రాంగం తనిఖీలు నిర్వహించి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, అన్న ప్రసాదాలు, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలపై ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు వైకుంఠ ఏకాదశిపై ప్రత్యేక బోర్డు సమావేశం నిర్వహించి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సామాన్య భక్తులకు ఈ-డిప్ విధానం ద్వారా దర్శన టోకెన్లు కేటాయించామన్నారు. భక్తులందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐదు రోజుల పాటు ఈ-డిప్ రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించామన్నారు. దాదాపు 24 లక్షల మంది భక్తులు ఈ-డిప్ కు రిజిస్ట్రేన్ చేసుకోగా మొదటి మూడు రోజులకు 1.89 లక్షల భక్తులను ఈ-డిన్ ద్వారా ఎంపిక చేసి టోకెన్లు కేటాయించామని తెలిపారు. ఈ మూడు రోజులకు టోకెన్లు పొందిన భక్తులకు నిర్దేశిత తేది, సమయాన్ని కేటాయించడం జరిగిందని, ఆ సమయం ప్రకారమే భక్తులు దర్శనానికి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకు ండా రెండు గంటల్లోనే దర్శనభాగ్యం కలుగుతుందని అన్నారు.ఈ-డిప్ ద్వారా టోకెన్ పొందలేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వ దర్శనం క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొదటి మూడు రోజులు మాత్రమే ఈ-డిప్ విధానంలో టోకెన్లు కేటాయించా మని, చివరి ఏడు రోజులు భక్తులు నేరుగా తిరుమలకు వచ్చి సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అదేవిధంగా జనవరి 2 నుండి 8వ తేది వరకు రోజుకు 15 వేల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను, 1500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ లో విడుదల చేశామని చెప్పారు. తిరుపతి, తిరుమల స్థానికులకు స్థానికుల కోటా కింద జనవరి 6,7,8 తేదీల్లో రోజుకు 5వేల టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, న్యూ ఇయర్ బందోబస్తుపై టీజీఐసీసీసీలో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ సజ్జనార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలోని హాట్ స్పాట్లు, నేరప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం నుంచి నగరవ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తనిఖీల కోసం 7 ఎ÷-లాటూన్ల అదనపు పోలీస్ బలగాలు మోహరిస్తున్నట్లు వివరించారు సీపీ సజ్జనార్. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా, 6 నెలల జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. ర్యాష్ డ్రైవింగ్, వీలింగ్, రేసింగ్‌లపై జీరో టాలరెన్స్ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలకు వెళ్లేవారు డెసిగ్నేటెడ్ డ్రైవర్ లేదా క్యాబ్ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. పబ్‌లు, హోటళ్లలో వేడుకలకు డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు సీపీ సజ్జనార్. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు యాజమాన్యాలదే బాధ్యత అని చెప్పుకొచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళల భద్రతకు 15 షీ టీమ్స్ మఫ్టీలో నిఘా ఉంటాయని వివరించారు.

# దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

(మొదటి పేజీ తరువాయి)

అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో జరిగిన సర్పంచులు, వార్డ్ మెంబర్‌ల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదని విమర్శించారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గర్జిస్తున్నారని, ఆయన గర్జనకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసుల పేరుతో నిరాధారమైన లీకులు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. నామినేటెడ్ పద్ధతిపై ఆయన ధ్వజమెత్తారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చూసి భయంతో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంలేదని, నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేస్తూ కాలక్షేపం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలు పెడితే రైతులు తగిన బుద్ధి చెబుతారనే భయం ముఖ్యమంత్రిలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయదారులు, కూలీలు ప్రభుత్వంపై తీవ్ర కోపంతో ఉన్నారని, ఆ ప్రభావం ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. రైతుబంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు నెలకు వెయ్యి రూపాయల భరోసా వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేసీఆర్‌పై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే.. రైతులకు మంచి చేశామన్న నమ్మకం ఉంటే.. సహకార ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. ఎన్నికల నుంచి కాంగ్రెస్ ఎన్ని రోజులు తప్పించుకున్నా, ప్రజాక్షేత్రంలో ఆ పార్టీని నిలదీయడం ఖాయమని కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ కేవలం కాలక్షేప రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే, కేసుల గురించి వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు రావాలని, ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. హోంమంత్రి కూడా ఆయనే కాబట్టి ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు.

# అక్రమ వలసదారులకు ట్రంప్ గాలం

(మొదటి పేజీ తరువాయి)

వీడేందుకు అంగీకరించిన వారికి ఇస్తామన్న స్టైఫండ్‌ను మూడు వేల డాలర్లకు పెంచినట్లు పేర్కొంది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని తెలిపింది. ఈ హాలీడే ఆఫర్ ఈ ఏడాది చివరి వరకు మాత్రమేనని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది.డీహెచ్ఎస్ ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి 19లక్షల మంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడిపోయారని సమాచారం. వీరిలో కొన్ని వేల మంది సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించు కున్నట్లు తెలిసింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 1.5లక్షల మందిని బహిష్కరించగా.. దాదాపు 13వేల మంది స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ గణాంకాలకు సంబంధించి అధికారిక సమాచారం వెలువడలేదు. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వందలాది మందిని అరెస్టు చేస్తోంది. అనంతరం వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛందంగా అమెరికా వీడాలనుకునే వారికి ప్రోత్సాహకంగా వెయ్యి డాలర్లు ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈ ఏడాది మేలో ప్రకటించింది. ఇందుకోసం కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ హోమ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. అటువంటి వారిని నిర్బంధించా ల్సిన అవసరం లేకుండా చూస్తామని, బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదు వారిపై విధించిన జరిమానాలపైనా మినహాయింపు ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం అందిస్తోన్న ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోని అక్రమ వలసదారులకు అరెస్టు, బహిష్కరణ మాత్రమే మార్గమని డీహెచ్ఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు అటువంటి వారికి అమెరికాకు మళ్లీ తిరిగి వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేస్తున్నారు.

# సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

మంచి పాలన అందించి, పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతారని.. మీరంతా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో.. నవంబర్ 11, 14, 17 తేదీల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచింది. మూడు దశల్లో మొత్తం 6821 స్థానాల్లో గెలుపొందింది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ 3520 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ 703 స్థానాల్లో గెలిచింది. ఇతరులు 1654 స్థానాలను గెలుచుకున్నారు.

# గ్రామాలకు ఇక పల్లెవెలుగు ఎలక్ట్రిక్ బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

చెందినవైనా తప్పనిసరిగా ఏసీవే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఈవీనే కొనుగోలు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జిల్లాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ముందుగా ఏర్పాటు చేయాలని, వీటికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ప్రవేశపెట్టే ఈ బస్సుల రోడ్ మ్యాప్‌పై సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

# రవాణాశాఖ డిప్యూటి కమిషనర్ కిషన్ నాయక్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో అక్రమ ఆస్తులను గుర్తించామన్నారు. హైదరాబాద్‌లో ఆరు చోట్ల, నిజామాబాద్‌లో మూడు చోట్ల, నారాయణఖేడ్‌లో 3 చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో 30 ఎకరాలు, నిజామాబాద్‌లో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు. పాట్ మార్కెట్ లోని అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక కిలో బంగారంతో పాటు, నిజామాబాద్‌లో లహరి అంతర్జాతీయ హోటల్, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల పైగా అక్రమ ఆస్తులు గుర్తించామని, బహిరంగ మార్కెట్లో వాటి విలువ రెండింతలు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అతని బంధువు విజయ్ ఇంట్లో పలు డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కిషన్ నాయక్ కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు తెలుసుకుంటామని ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

# తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హోఁచ్‌వోడీలు వెరిఫై చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. '

# 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా యూరియా యాప్

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవడం జరిగిందని, మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను కూడా వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని, వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఒటిపి చూపించి కొనుగోలు చేసారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్ ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం కావాల్సిందిగా అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ రోజు రైతునేస్తంలో కూడా రైతులకు యాప్ పై గల సందేహాలను నివృత్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ రబీ సీజన్‌కు గాను రాష్ట్రానికి 5.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని, యూరియా వినియోగం అధికంగా ఉండే జనవరి, ఫిబ్రవరి నెలల కు గాను సరిపడ యూరియాను ముందస్తుగానే తెప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# అక్రిడేషన్ కమిటీల్లో యూనియన్లకు ప్రాతినిధ్యం

**హైదరాబాద్,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడేషన్ ల జారీ కోసం నూతన మార్గదర్శకాలతో జి.వో. జారీ చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీలో యూనియన్ల ఎంపిక కోరకు మంగళవారం పత్రిక నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన జర్నలిస్టు యూనియన్లు ఈ నెల 29వ తేదీ లోపు సమాచార శాఖ కమిషనర్ కు తమ ప్రతిపాదనలను అవసరమైన ధ్రువపత్రాలతో పాటు సమర్పించాల్సిందిగా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మతిభ్రమించిన మాటలు మానుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**

**మీరేమీ సత్య హరిచంద్ర ని వారసుల కారు**

**.అన్ని రకాల మాఫియాను ప్రోత్సహిస్తున్నది మీరే**



**కల్లూరు, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికలలో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి ప్రతిపక్షాలపై విషం జల్లుతూ ఓట్లు వేసిన ప్రజలను అవమానించేలా ఒక ఎమ్మెల్యే కానీ వ్యక్తి మాట్లాడే మతిభ్రమించిన మాటలు మానుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి డాక్టర్ లక్కినేని రఘు నివాస గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 పైగా గ్రామపంచాయతీలు బి ఆర్ ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారని ఆయన తెలిపారు. నూతన సర్పంచులుగా, ఉప సర్పంచ్లుగా,సభ్యులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. గడచిన ఎన్నికలలో పోలీస్ యంత్రాంగాన్ని, అన్ని మండలాల ఎస్ఐలను తమ స్వార్థానికి వాడుకొని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను అన్ని రకాలుగా బెదిరించి, వారిపై బైండోవర్ కేసులు విధించి భయభ్రాంతులకు గురి చేసినప్పటికీ ప్రజా తీర్పులో తమ పార్టీ అభ్యర్థుల విజయం సాధించారని ఆయన అన్నారు. ఈ ప్రజా తీర్పును జీర్ణించుకోలేక కోట్ల రూపాయలు వెదజల్లి అనైతికంగా గెలిచారని అవాకుల పేలుతున్నవారు ఓట్లు వేసిన ప్రజలను అవమానించేలా మాట్లాడటం తగదన్నారు. 15 సంవత్సరాల ప్రజా పరిపాలన అందించిన తన చరిత్రలో ఏనాడు అక్రమాలను ప్రోత్సహించలేదని, అలాంటి అవసరమే తనకు లేదని అన్నారు. ఈ నియోజకవర్గంలో ఇప్పుడున్న ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే కానీ ఒక వ్యక్తి ఈ నియోజకవర్గ వ్యాప్తంగా ఇసుక మాఫియాను, మట్టి మాఫియాను ప్రోత్సహిస్తూ, సింగరేణి గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్లను బెదిరించి కూడగొట్టిన డబ్బులు మీరే వెదజల్లారని మీలాగా దిగజారి మాట్లాడలేనని ఆయన స్పష్టం చేశారు. గతంలో వరద బాధితుల కోసం సేకరించిన లారీలకొద్ది బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్న చరిత్ర మాది కాదన్నారు. గంజాయిని, పేకాటలను ప్రోత్సహించే నాయకత్వం మాది కాదని అన్నారు. స్థానికంగా పెన వేసుకున్న సమస్యల పరిష్కారం కోసమే కొన్ని గ్రామాలలో మా నాయకులు ఏకగ్రీవానికి సహకరించారని, అంతమాత్రాన ఆ గ్రామాలలో మా పార్టీ లేదనుకోవడం మీ మూర్ఖత్వమే అవుతుందని ఎద్దేవా చేశారు. కులాన్ని అడ్డం పెట్టుకొని ఏనాడు తను రాజకీయం చేయలేదని గుర్తు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 గ్రామ పంచాయతీలను గెలుచుకొని, 40 కంటే తక్కువ ఓట్లతో 31 పైగా గ్రామపంచాయతీలు చేజారాయని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని స్పష్టంగా తెలుసుకున్న పై నాయకత్వం వారిపై వేస్తున్న అక్షింతలను భరించలేక మానసిక ధైర్యం కోల్పోయి మతి చలించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నీ జీవితం కాంగ్రెస్ తోనే ప్రారంభం కాలేదని, గత ఎలక్షన్ టైంలో టిఆర్ఎస్ పార్టీ మారి కాంగ్రెస్ లోకి చేరిన సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. మా అభ్యర్థులు గెలవకపోతే మీ గ్రామ పంచాయతీలకు సంక్షేమ పథకాలు ఎలా వస్తాయో చూస్తానని అనటం నీ రాజకీయ అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. నీ బెదిరింపులను ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదని గ్రహించి ప్రజా తీర్పును గౌరవించాలని కోరారు. మా పార్టీ బలపరిచిన సర్పంచులతో ప్రజాస్వామ్యబద్ధంగా, రాజకీయాలకతీతంగా ప్రజా సేవలు అందించే విధంగా వారితో మమేకమై సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మోసగాలను సమర్థించే నాయకులం మేము కాదని స్పష్టం చేశారు. నిజమైన మోసగాళ్లను గుర్తించి శిక్షించడానికి చట్టాలు, పోలీసులు, న్యాయస్థానాలు ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో అన్ని రకాల మాఫియాలను ప్రోత్సహిస్తున్నది, తద్వారా డబ్బులు దండుకుంటున్నది ఎవరనేది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. త్వరలో జరగబోయే, ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికలలో తమ పార్టీ విజయం ఖాయమని, కార్యకర్తలందరూ సైనికుల పనిచేసే గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి, పెనుబల్లి, కల్లూరు పట్టణ కేంద్రాలలో 50 పడకల ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధమై ప్రజాసేవలకు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఎవరు ఏర్పాటు చేశారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. పనికిరాని రాజకీయాలకు పోయి, అవాకులు చవాకులు పేలే కంటే, నియోజకవర్గ అభివృద్ధి పై దృష్టి పెట్టి అన్ని హంగులతో సిద్ధమై ఉన్న నూతన ఆసుపత్రులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు డాక్టర్ లక్కినేని రఘు, కట్టా అజయ్ కుమార్, మాజీ ఎంపీపీ బీరవెల్లి రఘు,మండల పార్టీ అధ్యక్షులు పాలెపు రామారావు, చెన్నూరు సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు, కొరకోప్పు. ప్రసాద్, ముస్లిం మైనార్టీ సదర్ ఎస్డి రవుఫ్, ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్కే కమ్లి, మండల టిఆర్ఎస్ నాయకులు సర్పంచ్ కాటంనేని వెంకటేశ్వరరావు, పెద్ద బోయిన మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు చారుగుండ్ల సందీప్, బానోతు కృష్ణ, సామ్యూల్, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, రమేష్, ఎండి ఇస్మాయిల్, ధర్నాసి కరుణాకర్, హరి, నందిగామ ప్రసాద్,టిఆర్ఎస్కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన గొడ్ల ప్రభాకర్

**గ్రామాభివృద్ధికై నా ప్రయాణం ఉన్నతంగా కొనసాగిస్తా...**

**అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు ధన్యవాదాలు**





**తల్లాడ, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో అన్నారుగూడెం గ్రామ పంచాయతీ ఎలక్షన్ లో ఘన విజయం సాధించి సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచ్ , ఉప సర్పంచ్, గ్రామ పాలకవర్గం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికై అహర్నిశలు కష్టపడి గ్రామాభివృద్ధికి పాటుపడతామని మాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఒక ఉన్నతమైన బాధ్యతగా భావించి పని చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. నాకిచ్చిన ఈ బాధ్యతను ఒక గురుతర బాధ్యతగా భావించి ప్రజాసేవకు నిరంతరం శ్రమిస్తానని గ్రామ అభివృద్ధికి బాటలు వేసి అన్ని రంగాలలో ముందు ఉంచడానికి కృత నిశ్చయంతో పనిచేస్తానని నేను నాయకుడిగా కాకుండా మీసేవకుడుగా పనిచేస్తానని, ప్రజాసేవకు నేనొక ఆయుధంగా ఉంటానని ఈ ఆయుధాన్ని ప్రజాసేవకు గ్రామ అభివృద్ధికి ఎవరైనా వాడుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రజా సేవలో ప్రయాణం కొనసాగిస్తానని అవకాశాన్ని ఆశయంగా మార్చుకొన్ని పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. సమాజసేవే మా నినాదం, అదే మా నాయకుడు మాకు నేర్పిన విధానం అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, ప్రస్తుత గ్రామ ఉపసర్పంచ్ సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరరావు (కె.వి), బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, నూతన పంచాయతీ పాలకవర్గం, గ్రామ సీనియర్ నాయకులు బొమ్మగాని నాదం,యువ నాయకులు గోవిందు శ్రీనివాసరావు (ట్రాక్టర్), టిడిపి నాయకులు దుగ్గినేని వెంకటయ్య, నాయకులు పొన్నం కృష్ణయ్య, బిజెపి నాయకులు ఆపతి వెంకట రామారావు, దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, మహాకూటమి నాయకులు, పంచాయతీ సెక్రెటరీ, మల్టీపర్పస్ వర్కర్స్ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ మెట్టింగ్‌లో పాల్గొన్న రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ పడాల రాహుల్..




**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 23(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, రోడ్ సేఫ్టీ కమిటీ చైర్మన్ పమేలా సత్పతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ కమిటీ మెట్టింగ్ లో సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ లతో కలిసి పాల్గొన్న రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ పడాల రాహుల్,2026 జనవరి నెలలో నిర్వహించనున్న 37వ జాతీయ రోడ్ భద్రతా మాసోత్సవాలలో చేపట్టే కార్యక్రమల గురించి ప్రణాళికలు రూపొందించడం జరిగింది.. ఈ సందర్భంగా ఆర్టీఏ మెంబెర్ పడాల రాహుల్ మాట్లాడుతూ.. రేకుర్తి నుండి కొత్తపల్లి వరకు ఎడ్యుకేషనల్ కారిడార్ గా ప్రకటించి, స్పీడ్ నియంత్రణకు కావలసిన తగు చేర్యలు తీసుకోవడం వల్ల సుమారు 20 వేల మంది విద్యార్థులను ప్రమాదాలు జరగకుండా నియంత్రిచవచ్చు అని తెలిపారు. ఎన్టీఆర్ చౌరస్తా నుండి ఫార్మసీ కాలేజీ బ్లాక్ వరకు పాదచారులకు కొరకు ఫుట్ పాత్ ఏర్పాటు చేయడం ద్వారా కాలి నడకన కాలేజీలకు, టూరిజం అట్రాక్షన్ గా ఉన్న ఉజ్వల పార్కు, డీర్ పార్క్ వెళ్ళే బాటసారలుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కరీంనగర్ బస్ స్టాండ్ నుండి శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ వరకు స్పెషల్ బస్ ఏర్పాటు చేయడం ద్వారా ఐటిఐ, ఎటిసి, పాలిటెక్నిక్, ఎస్ యు ఫార్మసీ, సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు, ఐటి హబ్ ఉద్యగులకు రవాణా సమస్య తీరుతుందని, అదేవిధంగా డీర్ పార్క్, ఉజ్వల పార్కుకు టూరిజం పెరుగుతుందని తెలిపారు, ఆర్ఓబి తీగలగుట్టపల్లి పనులు త్వరగతిన పూర్తి చేయాలని, అదే విధంగా ఆర్ఓబి కింద ఉన్న రోడ్ గుంతల మయం అయిందని, అట్టి రోడ్డును మరమత్తులు చేసి సమస్యను పరీక్షించాలని సూచించారు,జనవరి 2026 లో జాతీయ రోడ్ భద్రతా మాసోత్సవాలలో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ మీద వ్యాస రచన పోటీలు, క్విజ్ కాంపిటీషన్స్, రికగ్నిషన్ అండ్ రివార్డ్స్, సిమ్యూలేషన్స్ తో అవగాహన, తిమ్మాపూర్ లో చొక్కరావు ట్రాఫిక్ అవేర్నెస్ పార్కో అవగాహన కార్యక్రమలు, సిపిఆర్ ట్రైనింగ్ లాంటి పలు కార్యక్రమాలను నిర్వించాలని కోరారు.



# ఆర్టీసీ బస్సుల్లో జిరాక్స్ అక్రిడేషన్ కార్డు చెల్లనేరవు?.

**● వెల్లడించిన ఆర్టీసీ అధికారులు?.**



**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 23(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కొందరికి మాత్రమే ప్రభుత్వం జారీ చేసిన అక్రిడేషన్ కార్డులు ఉన్నాయి. వారి అవసరాన్ని బట్టి ప్రయాణం చేసేటప్పుడు జిల్లా బస్సు పాసులు,స్టేట్ బస్సు పాసులు రెండు రకాల ఉన్నాయి. అక్రిడేషన్ కార్డు కలిగి ఉన్న జర్నలిస్టులు ఎవరైనా సరే వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు వారి ఒరిజినల్ కార్డును వెంట తీసుకువెళ్లాలని ఆర్టీసీ అధికారులు సూచించారు?. తొర్రూరు టీజీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఒక జర్నలిస్టు ఒరిజినల్ అక్రిడేషన్ బదులుగా జిరాక్స్ అక్రిడేషన్ తీసుకొని బస్సు ప్రయాణం చేశారని బస్సులోని కండక్టర్ ఇది చెల్ల నేరదని చెప్పటంతో హైదరాబాద్ కు వెళ్లాల్సిన ప్రయాణికుడు టిక్కెట్టు తీసుకున్నారని అంతటితో ఆగకుండా నన్ను ఒరిజినల్ జర్నలిస్టు కాదని అంటావా అని వాధనకు దిగినట్లుగా విశ్వసనీయ సమాచారం?.

# నర్సంపేట శ్రీ చైతన్య విద్యార్థులకు నాసా కిట్ల పంపిణి





**నర్సంపేట డిసెంబర్ 23(పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ నాసా కిట్లను విద్యార్థిని విద్యార్థులకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లం నవీన్ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన ఆధునిక సాంకేతిక పురోగతుల గురించి విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కే అమర్ నాథ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం( నేషనల్ స్పేస్ సొసైటీ )నిర్వహించేటువంటి నాసా కాంటెస్టో మా పాఠశాలకు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అంతరిక్షానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకొని భవిష్యత్తులో అంతరిక్షంలో జీవించడానికి తగిన ప్రణాళికను రూపొందించి ప్రపంచ స్థాయిలో బహుమతులు పొందడం జరిగిశీదని గత సంవత్సరం భూక్య నిహారిక రోడ్ మ్యాప్ టు స్పేస్ విభాగంలో ప్రపంచ స్థాయిలోనే మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల చైర్మన్ శ్రీ విద్యా,శ్రీధర్. డీజీఎం చేతన్ , ఏజీఎం పద్మాకర్ ,అకాడమిక్ కోఆర్డినేటర్ తిరుమలరెడ్డి , సి బ్యాచ్ ఇంచార్జ్ చంద్రకాంత్ ,నాసా జోనల్ ఇంచార్జ్ రాజ్ కుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం అందరికీ సమాన హక్కు కల్పించింది కదా..?

**ప్రభుత్వ అధికారికో న్యాయం విలేఖరికి ఓ న్యాయమా..?**

**రిపోర్టర్‌ని దూషించిన డిప్యూటీ కమిషనర్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

**వివరణ కోరితే బెదిరింపులకు పాల్పడ్డ ముషీరాబాద్ ఉప కమిషనర్ రామాంజనేయులు రెడ్డి**



**సికింద్రాబాద్ డిసెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** అవినీతి అక్రమాలపై వివరణ కోరినందుకు ఓ జర్నలిస్టును ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతూ దురాషేలాడిన విషయం పై గ్రేటర్ హైదరాబాద్ రిపోర్టర్లు చిలకలగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ జర్నలిజం వ ృత్తి రీత్యా అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసిన లేక ఏదైనా సమస్య కాని అవినీతి అక్రమాలు కానీ అధికారుల ద ృష్టికి మేము తీసుకువెళ్లినప్పుడు తిరిగి వాళ్ళని దానికోసం వివరణ అడగడం సహజమని అలా అడిగినందుకు జిహెచ్ఎంసిలో ఉన్నత అధికారి అయ్యుండి తన స్థాయిని మరిచి ఓ డిప్యూటీ కమిషనర్ రిపోర్టర్ను ఇస్తా రాజ్యాంగ దూషించటంతో పాటు బెదిరింపులకు పాల్పడినందుకు యావత్ జర్నలిస్టులోకం ఆగ్రహం వ్యక్తం చేసింది ఇదే ఓ అధికారిని ఓ రిపోర్టర్ తిట్టి ఉంటే ఇప్పటి వరకే కేసు నమోదు చేసి రిపోర్టర్ ని అరెస్టు చేసే వారు కాదా అలాంటిది రిపోర్టర్లను తిట్టిన మున్సిపల్ ఉన్నత అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

# నూతన సర్పంచి వేముల భాస్కర్ చిరు సత్కారం



**గంగాధర, డిసెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి గంగాధర మండలంలోని మధురానగర్ లో నూతన గ్రామపంచాయతీ సర్పంచిగా ప్రమాణస్వీకారం చేసిన వేముల భాస్కర్ గారికి మధురానగర్ ఆర్యవైశ్య మధురానగర్ అధ్యక్షులు పడకండి సంతోష్, ప్రధాన కార్యదర్శి నాళ్ళ రామ్, ఉపాధ్యక్షులు రేగురి అభిలాష్, బొడ్ల లక్ష్మీకాంతం,ముఖ్య సలహాదారుడు నలుమాచుహరికిషన్, బిక్కుమల్ల నాగరాజు, కోశాధికారి బొడ్ల శ్రీనివాస్, సభ్యులు గుండ సందీప్,చిరు సన్మానం చేసి సత్కరించినారు ఇట్టి కార్యక్రమానికి మధురానగర్ ఆర్యవైశ్య సోదరులందరూ పాల్గొన్నారు.

# బుగ్గపాడులో ఘనంగా నూతన గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం









**సత్తుపల్లి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలో బుగ్గపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. సర్పంచ్‌గా బొడ్డు రోజా లక్ష్మి, ఉపసర్పంచ్‌గా పలగాని శ్రీనివాసరావుతో పాటు మరో తొమ్మిది మంది వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరై నూతన పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కాకర్లపల్లి సొసైటీ చైర్మన్ తుమ్మూరి ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ రోజా లక్ష్మి మాట్లాడుతూ గ్రామ పెద్దల సహకారంతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కోతులు, కుక్కల బెడద నివారణ, గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, శిధిలావస్థలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించి గ్రామస్తులకు ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తామని హామీ ఇచ్చారు. కుల, మత భేదాలు లేకుండా, పార్టీ సంబంధం లేకుండా అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని ఆదరించి సర్పంచ్‌తో పాటు పదికి పది వార్డులను గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పనులు చేసి ప్రజల మెప్పు పొందండి: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...



**తిమ్మాపూర్, డిసెంబర్ 23 (పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రామాభివృద్ధి కోసం మంచి పనులు చేయడం ద్వారా సర్పంచులు ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యులతో ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొత్తగా పంచాయతీ పగ్గాలు చేపట్టిన పాలకవర్గాలు గ్రామ సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. ముఖ్యంగా పరిశుభ్రత, ప్రజారోగ్యం, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం,వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా పారదర్శకంగా పాలన అందించడం ద్వారా ప్రజల మెప్పు పొందాలన్నారు. ఈ సమావేశంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, చీమలకుంటపల్లి, చొక్కారావుపేట, గుండ్లపల్లి, గుండ్లపల్లి ఎక్స్ రోడ్, హన్మాజీపల్లి, ఖాసీంపేట, చొక్కారావుపల్లి గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

# గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి





**మానకొండూర్, డిసెంబర్23(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం జరిగిన మానకొండూర్ మండలం నిజాయతీగూడెం గ్రామ పంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కొలువుదీరిన కొత్త పాలకవర్గం ప్రజల అవసరాలు తీర్చడంలో ముందుండాలన్నారు. నిజాయతీగూడెం గ్రామంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు నిధుల కేటాయించానని, ఇక ముందు కూడా నిధులిస్తానన్నారు. అంతే కాకుండా మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు గ్రామ సర్పంచ్ గా బోళ్ల సరిత-మురళీధర్, ఉప సర్పంచ్ గా ఆడెపు శ్రీలత, వార్డు సభ్యులుగా ఎడ్ల లక్ష్మారెడ్డి, కండెసారి ప్రసాద్, గుర్రం స్వప్న, బొలవేణి స్రవంతి, గడ్డి అయిలయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీవో సతీష్ రావు ప్రమామం చేయించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరలక్ష్మి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్, పెద్దూరుపల్లి,మద్దికుంట సర్పంచులు హరీష్, బుర్ర శీధర్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కుంబం చిరంజీవి, పార్టీ నాయకులు సాయిరి దేవయ్య, రామిడి తిరుపతి, కానిగంటి మల్లికార్జున్, కోంద్ర సురేష్, బి.ఓదెలు, పర్షరాములు,పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి బీజేపీ తప్పకుండా సహకరిస్తుంది...

**- తిమ్మాపూర్ బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి...**



**మానకొండూర్, డిసెంబర్23(పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రామాల అభివృద్ధి కి సంబందించి బీజేపీ తప్పకుండా సహకరిస్తుందని తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి పేర్కొన్నారు. మోదీ గిఫ్ట్ పేరిట 10 వ తరగతి విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉచితంగా అందిస్తున్న సైకిల్ లను మంగళవారం మొగిలిపాలెం విద్యార్థులకు అందించారు. స్థానిక జడ్పి పాఠశాల హెచ్ఎం నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 15 మంది విద్యార్థులకు సైకిల్ లను అందించారు. అంతకుముందు బస్టాండ్ చౌరస్తా లో గ్రామస్తులంతా కలిసి సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన బీజేపీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించి పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉన్నారని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిధులను నేరుగా గ్రామ పంచాయతీ లకు పంపిస్తున్నదని పేర్కొన్నారు. మొగిలిపాలెం అభివృద్ధి కి బీజేపీ తప్పకుండా సహకరిస్తుందని, ప్రజలు ఆదరించాలని పేర్కొన్నారు. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం వల్ల ఆనాటి పోరాట యోధుల త్యాగాలు నేటి తరానికి తెలుస్తున్నాయని అన్నారు. గ్రామ అభివృద్ధిలో సంబందించి కేంద్ర మంత్రి సహకారంతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని,ఉచిత సైకిల్ ల పంపిణి కార్యక్రమం భవిష్యత్ కూడా జరగాలని స్థానిక సర్పంచ్ తాట్ల తిరుపతి కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల అనిల్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పాశం రాఘవ రెడ్డి,దళిత మోర్చా అధ్యక్షుడు ఎల్కపెల్లి స్వామి,బూత్ కమిటీ అధ్యక్షులు వరుకొలు రాజయ్య,సాయిల్ల అరవింద్,సీనియర్ నాయకులు పాశం వీర రాఘవరెడ్డి,గర్రెపెల్లి యాదగిరి,జవ్వాజీ శ్రీనివాస్, పాడె అనిల్,మండల నాయకులు బుర్ర శ్రీనివాస్, రేగూరి సుగుణాకర్, బుడిగె మహేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతి, సమానత్వాన్ని పాదుకొల్పుదాం...

- గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...





**మానకొండూరు, డిసెంబర్23(పీసీడబ్ల్యూ న్యూస్):** సమాజంలో శాంతిని, సర్వమానవ సమానత్వాన్ని నెలకొల్పేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండల కేంద్రంలోని కేఎస్సార్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి, ప్రేమ, దయ, కరుణ అందించిన క్రీస్తు మార్గం అనుసరణీయమైనదన్నారు. క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ, ఆయన బోధనలు పాటిస్తూ క్రైస్తవ సోదరులు సమాజ సేవకు పునరంకితం కావాలని ఆయన కోరారు. ఇప్పటికే క్రైస్తవ సంఘాలు సమాజసేవలో కీలకంగా వ్యవహరిస్తాయని ఆయన కొనియాడారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులను నెలకొల్పి ప్రజలకు మెరుగైన సేవలందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ క్రైస్తవ మతపెద్దలు, పాస్టర్లతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ వేడుకల్లో తహసీల్దార్లు సురేఖ(శంకరపట్నం),కర్ర శ్రీనివాస్ రెడ్డి (తిమ్మాపూర్), కనకయ్య(గన్నేరువరం), మానకొండూర్ ఉప తహసీల్దార్ సమ్మయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్,వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మామిడి అనిల్ కుమార్, వెల్ది,మద్దికుంట,బంజేరుపల్లి,చెంజర్ల, ఈదులగట్టెపల్లి గ్రామాల సర్పంచులు పెంచాల కిషన్ రావు, బుర్ర శ్రీధర్, తోట లత-శ్రీనివాస్, గొల్లెన కనకవ్వ-కొమురయ్య,మీస సత్యనారాయణ, కనకం సంపత్, పార్టీ నాయకులు రామిడి శ్రీనివాస్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, మడుపు ప్రేమ్ కుమార్, కోంద్ర సురేష్, ఇర్ఫాన్, కనకం అశోక్,బక్కారెడ్డి,నాగిశెట్టి రాజయ్యతోపాటు పలువురు పాసర్లు, క్రైస్తవ సోదరసోదరీమణులు పాల్గొన్నారు.

# గెలిచినా ఓడినా ప్రజల గొంతుకగా పనిచేస్తాం...

- ప్రజా సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దాం
- ఆదర్శవంతమైన పాలన అందిద్దాం





**గోదావరిఖని, డిసెంబర్23 (పీసీడబ్ల్యూ న్యూస్):** అంతర్గాం మండలంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గ్రామ సర్పంచిగా గెలుపొందిన కామ్రేడ్ జూపాక మమత మరియు పెద్దంపేట గ్రామంలో వార్డు సభ్యులుగా గెలుపొందిన కామ్రేడ్ మాలెం తిరుపతి, కామ్రేడ్ ఆరుముల్ల సృజన్ కుమార్ ను పార్టీ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జూపాక శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ అంతర్గా మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన ఓడిన ప్రజా సమస్యలపై గొంతును వినిపిస్తూనే ఉంటాం. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు కొనసాగిస్తూనే ఉంటాం. ఎన్నికల్లో ఓడినంత మాత్రాన కృంగిపోము. గెలిచినంత మాత్రాన విరవేగిపోము. అంతర్గాం మండలంలో పార్టీ గెలిచిన చోట ఆదర్శవంతమైన పాలనను ప్రజలకు అందిస్తాం. ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దుతాం. విప్లవ శ్రేణులంతా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన పార్టీ నేతలు పార్టీ విస్తరణకు, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మండలంలో బలమైన శక్తిగా మాస్ లైన్ ఎదిగే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లిఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, గొల్లపల్లి చంద్రయ్య ఈసంపల్లి రాజేందర్, ఆడేపు శంకర్, కోడిపుంజుల లక్ష్మి, పుల్లూరి నాగభూషణం, ఎగ్లాస్పూర్ గ్రామ సర్పంచ్ జూపాక మమత, వార్డు మెంబర్లు మాలెం తిరుపతి, ఆరుముళ్ళ సృజన్ కుమార్, తీగుట్ల నవీన్, దేవేందర్, తుళ్ల గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాల విద్యార్థినికి అభినందన..




**కొత్తపల్లి డిసెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని ఆర్టీసీ వర్క్ షాపు, సూర్యనగర్ లో గల బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థిని పి. అరుణకు ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ విభాగంలో సీటు పొందింది. ఈ సందర్భంగా బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ మహమ్మద్ అబ్దుల్ ఖుద్దుస్ విద్యార్థిని పి.అరుణ ను పూల బొకే, శాలువాతో అందించి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాలలో చదివే విద్యార్థులకు, ప్రత్యేకమైన శ్రద్ధతో విద్యను బోధించడం వల్లే ఇక్కడ చదివిన విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో ఉచిత సీట్లు పొందగలుగుతున్నారని చెప్పారు ఒకేషనల్ విద్యపై ప్రజల్లో ఉన్న అపోహలను, బ్లూమింగ్ కళాశాలలో చదివిన అరుణ పటాపంచలు చేసి ప్రభుత్వ సీటు పొందడం కళాశాలకు గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో అరుణ ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు.

# చంద్రబాబుపై కెసిఆర్ అనుచిత వ్యాఖ్యలు

**ఖండించిన ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాధం, కూరపాటి వెంకటేశ్వర్లు**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చంద్రబాబుపై కెసిఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాధం, కూరపాటి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ పలికిన అసత్యపు మాటలపై మండిపడ్డారు. తెలంగాణ సెంటిమెంట్ అడ్డం పెట్టుకుని తెలంగాణ ప్రజలను అమరవీరులను బూటకపు మాటలతో పదేళ్లు మోసం చేసిందే కాక మళ్లీ మాయ మాటలు చెప్పి చంద్రబాబుపై అసత్యపు ప్రచారాలు చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ పాలనపై పిట్ట కథలు సిగ్గుచేటని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలుగు రాష్ట్రాలకు సంపద సృష్టించి అభివృద్ధి పథంలో నడిపి పట్టణాల్లో వెలుగులు నింపింది. ఇప్పటికీ చూస్తే చంద్రబాబు అభివృద్ధి ఏంటో తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసు అని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఇలా



అసత్యపు మాటలు, అనుచిత వ్యాఖ్యలు చేయబట్టే టీడీపీ కార్యకర్తల దెబ్బకు తమ పార్టీ తుడిచి పెట్టుకుపోయిందని, మున్ముందు మీ పార్టీనీ బొంద పెట్టడం ఖాయం అన్నారు. చంద్రబాబు పేరు ఎత్తందే మీ పార్టీ మనుగడ ఉండదని పదే పదే ఇలా ప్రెస్ మీట్ పెట్టి అబద్దాల మాటలు నిజం చేయాలని తెలంగాణలో తెలుగుదేశంపార్టీ ఉండొద్దని కుట్ర చేస్తున్నారని అన్నారు. ఈసారి 2028 సంవత్సరంలో తెలంగాణలో కూడా టీడీపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇకనైనా బూటకపు మాటలు అసత్యపు ప్రచారాలు మానుకొని నిజమైన ప్రతిపక్ష పార్టీగా అసెంబ్లీ కి వెళ్ళి ప్రభుత్వంతో పని చేయించుకోనే పనిలో ఉండాలని, పార్టీ మనుగడ కాపాడుకోవాలని హితవు



పలికారు. అదేవిధంగా నిన్న ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా వారి అభిమానులు బైక్ ర్యాలీ చేసి డీజే పాటలతో సంబరాలు చేసుకునేది చేసుకోక తెలుగుదేశంపార్టీ కార్యాలయానికి వచ్చి జై జగన్ డౌన్ డౌన్ చంద్రబాబు అని నినాదాలు, వికృత చేష్టలు చేసిన సంగతి విధితమే. దీనికి సంబంధించి తెలుగుదేశం పార్టీ నాయకులు పాదయాత్రగా వెళ్లి ఎన్టీఆర్ సర్కిల్ లో బైఠాయించి రాస్తారోకో చేసి ఫిర్యాదు చేయడం జరిగింది. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎక్కడ రాజకీయ ఘర్షణలు పడవద్దని శాంతి భద్రతలకు విఘాథం కలిగించకూడదని సమన్వయం పాటించాలని అన్నారు. పోలీసులకు పిర్యాదుతో చట్టం తనపని తాను చేసుకు పోతుందని టీడీపీ అభిమానులకు తెలిపారు. ఈ పత్రికా సమావేశంలో జిల్లా నాయకులు కేతినేని హరీష్, గుత్తా సీతయ్య, నాగండ్ల మురళి, వాసిరెడ్డి భాస్కరరావు, రాజేశ్వరి, మందపల్లి రజిని, నున్నా నవీన్, ప్యారిస్ వెంకన్న, గుడెపిన్ని నాగేశ్వరరావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, కూచిపూడి జై, నల్లమోతు సత్యనారాయణ, కొలికొండ మురళి, తదితరులు ఉన్నారు

# క్రీస్తు ప్రేమ, శాంతి సందేశాన్ని నిజజీవితంలో ఆచరించాలి











**తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు**

**టీజీవో ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్రీస్తు ప్రేమ, శాంతి సందేశాన్ని నిజజీవితంలో ఆచరించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రాత్రి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లాశాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి అధ్యక్షతన సెమీ క్రిస్మస్ ఉత్సవాలను టీజీవో భవన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీవో కేంద్ర సంఘం అధ్యక్షులు, టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీస్తు సమస్త జనుల పాపాలను తీసివేయుటకు మానవ రూపంలో డిసెంబర్ 25న జన్మించారని, మానవుడు ఏ విధంగా నడుచుకోవాలో తను ఆచరించి చూపించారని, అందరి పట్ల కరుణ జాలితో వ్యవహరించారని, నీతి నిజాయితీతో ఎదిగారని, ఎందరినో ఆరోగ్యవంతులుగా మార్చారని తన మీద ఆరోపణలను చేసిన వారిని కూడా క్షమించారని, వారి పాపాలను తన రక్తము ద్వారా శుద్ధి చేశారని వివరించారు. నేటి కాలంలో అందరూ ఆయన సందేశాన్ని ఆచరిస్తూ శాంతి సౌభాతృత్వాన్ని నెలకొల్పాలని, సోదరభావంతో మెలగాలని సూచించారు. కష్టాలలో ఉన్న వారికి సాయపడాలని అప్పుడే వ్యక్తిగతంగా అయినా సంఘపరంగా అయినా నిజమైన మనుషులుగా ఉండగలమని అభిప్రాయపడ్డారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ అన్ని మతాలను వారి ఆచారాలను గౌరవిస్తూ ఉద్యోగులందరూ కలిసిమెలిసి ఉండటానికి ఖమ్మంలోని ఉద్యోగుల కాలనీలలో అన్ని దేవాలయాలను నిర్మించారని ఉద్యోగులకు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ఏలూరి శ్రీనివాసరావు పెద్ద దిక్కుగా ఉన్నారని వారు ఖమ్మం జిల్లా నుండి ఉండడం మన అదృష్టం అని చెప్పారు. అనంతరం ఏలూరు శ్రీనివాసరావు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టి క్యాండిల్స్ తో యేసుక్రీస్తుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీజీవో కేంద్ర కమిటీ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, జిల్లా కోశాధికారి సూరంపల్లి రాంబాబు, అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, గంగవరపు నరేందర్, హౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రటరీ డా. పి విజయ్ కుమార్, టీజీవో మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, టీజీవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, కార్యదర్శి మహేష్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొనిదెన శ్రీనివాసరావు, రాష్ట్ర బాధ్యులు జైపాల్, గంగవరపు బాలకృష్ణ, ట్రెజరర్ వెంకన్న, మహిళా అధ్యక్షురాలు లలిత కుమారి,టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీమతి ఉషశ్రీ, సుధారాణి, విజయ కుమారి, విజయలక్ష్మి ప్రమీల రాణి, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీనివాస్, శారద, మంజుల, జాన్ పాటిల్, గోపాలకృష్ణ, శంకర్, అరుణ కుమారి, బాలాజీ, భాస్కరరావు, తాజుద్దీన్, టీఎన్జీవో జిల్లా బాధ్యులు కొమరగిరి దుర్గాప్రసాద్, తాళ్లూరు శ్రీకాంత్, కోణార్, పెదినేని రాధాకృష్ణ, రమేష్, తెలంగాణ రెవెన్యూ సంఘం అధ్యక్షులు సునీల్ రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ జిల్లా అధ్యక్షులు రాజేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, అధ్యక్షులు షేక్ రంజాన్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, రాష్ట్ర బాధ్యులు విజయ్, నాగిరెడ్డి, ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, జిల్లా బాధ్యులు మల్సూర్, హెచ్ఎంస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరస్వామి, జాయింట్ రిజిస్టర్ రామకృష్ణారెడ్డి, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు సుబ్బయ్య, కార్యదర్శి వేణు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, అధ్యక్షులు గోపీచంద్, ఎస్జిపిఏ జిల్లా అధ్యక్షులు పరిష పుల్లయ్య, కార్యదర్శి రవికుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షులు సుధాకర్, ఎక్సైజ్ ఫోరం అధ్యక్షులు కృష్ణ, రాంప్రసాద్, లెక్చరర్స్ అసోసియేషన్ కొప్పిశెట్టి సురేష్, అల్లూ విజయ్, భరత్, లైబ్రేరియన్స్ అసోసియేషన్ నక్క ప్రసాద్ బాబు, ఫణి కుమార్, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి వరప్రసాద్, ఎంపీడీవోస్ అసోసియేషన్ షేక్ సిలార్, ఎంపీఓస్ అసోసియేషన్ సూర్యనారాయణ, జి వెంకటేశ్వర్లు, ట్రెజరీ అధికారుల సంఘం మోదుగు వెంకటేశ్వరరావు, ఎన్.వి కృష్ణారావు, సైదులు, నాగేంద్ర కుమారి, వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్. గోపి, జిల్లా బాధ్యులు కిరణ్, శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ అసోసియేషన్ సింహాచలం, నవీన జ్యోతి, సిపిఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద్రకంట శశిధర్, తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు బిక్కు నాయక్, కార్యదర్శి వెంకటరమణ, డ్రైవర్ సంఘం జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, సలీం, కోటేశ్వరరావు, తదితరులు హాజరైనారు.

# ఎస్సీ తొలి మహిళగా ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచ్.

**అధికారులలాంచనంగా సర్పంచి సీటులో ఆసీనులైన విసంపల్లి కవితా బాలకృష్ణ.**

**తొలి సంతకం చేశారు రైతులకు సాగునీరు, గ్రామానికి ప్రజలకు తాగునీరు.**

**సర్పంచికి సన్మానం చేశారు అధికారులు**





**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆకాశమంత పందిరి, భూదేవి అంత పీట వేసి మేళ తాళాలతో, వేదమంత్రాలతో జనం గుండెలో తనకంటూ ఒక ముద్రను వేసుకుని జనం మధ్యలో అడుగులో అడుగు వేసుకుంటూ డీజే చప్పుల మధ్య కోలాటాలతో కోలాహలంగా జాతీయ పక్షిగా అడుగులు వేస్తూ రహదారి నిండా నిండిపోయిన జనం మధ్యలో తాళి కట్టిన భర్త తోడు ఉండగా భూలోకమంత పందిరి కిందికి రానే వచ్చారు. దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదం తీసుకొని తనకు వేసిన కుర్చీ వైపు అడుగులు వేస్తూ తనకిచ్చిన అధికారాన్ని వమ్ము చేయనని గ్రామంలోని ప్రజలందరి ముందు అధికారుల నడుమ అధ్యక్ష నేను గెలుచుకున్న నా సీటుకు న్యాయం చేస్తానని, గ్రామంలో నెలకొన్న తాగునీరును ప్రజలకు అందిస్తానని, రైతులకు ఉన్న సమస్య సాగునీరు పై స్పందిస్తానని గ్రామ ప్రజల ముందు నేను ప్రమాణం చేస్తున్న ఎల్లకాలం మీకు అండగా ఉంటా, ఆపద వస్తే నేనంటూ తోడుగా ఉంటా, గ్రామ ప్రజల్లో తలలో నాలుకలా నేను మీ వెంట



ఉంటా అంటూ విసంపల్లి కవితా బాలకృష్ణ అధికారులు తెలిపిన విధంగా ప్రమాణ స్వీకారం చేశారు. తన మనసులోని మాటను, గ్రామస్తులకు కావలసిన అవసరాలను దృష్టిలో ఉంచుకొని తొలి సంతకం చేశారు సర్పంచి అభ్యర్థి నుండి నూతన సర్పంచిగా పేరు మార్చుకున్నారు దటీజ్ కవితా బాలకృష్ణ.కన్నవారి కనుల ముందు కుటుంబ సభ్యుల నడుమ తనకి ఇష్టమైన ఏసుప్రభును ప్రార్థిస్తూ భూదేవి అంత పీటపై ఆసీనులైనారు. మహబూబాబాద్ జిల్లా,తొర్రూరు మండల కేంద్రంలోని గుర్తురు గ్రామం



పంచాయతీలో ఎస్ సి మహిళకు సీటు కేటాయించగా సర్పంచ్ సీటు కొరకు ఆరుగురు మహిళలు పోటీ చేశారు. గ్రామం ఓటర్ల మనసును దోచుకొని నన్ను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానంటూ వాగ్దానం చేసిన విసంపల్లి కవిత బాలకృష్ణ ఆశలు నెరవేరాయి 700 పైన ఓట్లు పడగా పోటీపడిన అభ్యర్థులపై 60 ఓట్ల మెజార్టీతో విజయాన్ని సాధించారు. గ్రామానికి తొలి ఎస్సీ మహిళగా సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకు న్నారు. అధికారులు అభినందిస్తూ శాలువాతో సన్మానం చేశారు. అనంతరం గ్రామ పెద్దలందరి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు.

## కార్మికులకు దుప్పట్ల పంపిణీ

**- స్ఫూర్తి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు**



**కల్లూరు, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న 100 మంది కార్మికులకు మంగళవారం మున్సిపాలిటీ ఆవరణంలో దుప్పట్లు పంపిణీ చేయబడ్డాయి. పట్టణ శుభ్రత, అభివృద్ధి కార్యాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ కార్మికుల సంక్షేమానికి ఈ కార్యక్రమం మరో మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. మా మున్సిపాలిటీ కార్మికులను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషకరం అని ఈ ఫౌండేషన్ సేవలు అద్భుతంగా ఉన్నాయని కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ కల్లూరు ప్రతినిధి వరకా రామారావు మాట్లాడుతూ, ఫౌండేషన్ చేపట్టిన సేవల గురించి వివరించారు. మండల పరిధిలో ఇప్పటివరకు 35 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిచడం జరుగుతుందని నిరుపేద స్థితిలో ఉన్న ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు చేయూత అందిస్తూ, వారు సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవటానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజ సేవలో మా ఫౌండేషన్ నిబద్ధత చూపిస్తున్నాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపాలిటీ కార్మికులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మమ్మల్ని గుర్తించి దుప్పట్లు పంపిణీ చేసినందుకు స్ఫూర్తి ఫౌండేషన్ ఫౌండర్ శ్రీ వ్యాల్ కు కృతజ్ఞతలు తెలుపుతూ ఇది మా పనికి మరింత స్ఫూర్తినిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్స్, ఆఫీస్ సిబ్బంది, మున్సిపాలిటీ కార్మికులు, ఫౌండేషన్ వాలంటీర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపుడి కృష్ణ, వార్డ్ ఆఫీసర్స్, ఆఫీస్ సిబ్బంది, మున్సిపాలిటీ కార్మికులు, ఫౌండేషన్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## చిరకాల మిత్రుని కలిసిన డిప్యూటీ సీఎం





**తల్లాడ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో కొత్త మిట్టపల్లి లోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిరకాల మిత్రుడు చిత్తలూరి రమేష్ ఇంటి వద్దను కలుసుకొని తేనేటి విందును స్వీకరించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగాదేవి పాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, చిత్తలూరి రమేష్, చిత్తూరి నరసింహారావు, మొటమర్రి రమేష్ , గూడూరు సతీష్ రెడ్డి గుప్తా, అన్వర్ బేగ్,మైసూర్ కోటేశ్వరరావు, వేమిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జిఎఫ్‌లో జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించిన అక్షర హై స్కూల్ విద్యార్థిని

**రామడుగు, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల మధ్యప్రదేశ్ రాష్టం ఇండోర్ లో డిసెంబర్ 14 నుండి 19 వ తేదీ వరకు జరిగిన 69 వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే విభాగములో అక్షర హై స్కూల్ విద్యార్థిని తూడి అక్షర జాతీయస్థాయిలో తెలంగాణ నుండి 3 వ స్థానం సాధించింది. తూడి అక్షర ను కరీంనగర్ CP గౌస్ ఆలం అభినందించారు. వరసగా SGF గేమ్స్ లో 2 సార్లు జాతీయస్థాయికి ఎంపికకావడం విశేషం.ఈ కార్యక్రమములో కరస్పాండెంట్ మినుకుల మునీందర్ కరాటే మాస్టర్ రాజు పాల్గొన్నారు.





# చక్రవర్తి సుపరిచితుడే...!



### జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉద్యమించండి

### సీపీఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు

### జర్నలిస్టు పురోగతివాద ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు అవసరం

### టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి





**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకోసం ఉద్యమాత్మకంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ఈ పోరాటంలో భవిష్యత్తులో తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్- 2843) జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణలు తమ నాయకులతో పువ్వాడ నాగేశ్వర రావును వారి స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు కొత్తగా ఎన్నిక కాబడ్డ ఖమ్మం జిల్లా టీడబ్ల్యూజెఎఫ్ (H-2843) జిల్లా నాయకత్వానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ... జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పురోగతివాద ఉద్యమాలు అత్యంత కీలకమని, సంఘటిత పోరాటాల ద్వారానే శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. వృత్తిలో భద్రత, అక్రెడిటేషన్, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు వంటి అంశాలను నిర్లక్ష్యం చేయరాదని, వీటిపై నిరంతరంగా ఉద్యమాలు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా బలంగా ఉంటేనే సమాజం సజావుగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ పురోగతివాద దిశలో కార్యాచరణ రూపొందించి, అక్రెడిటేషన్, సంక్షేమ పథకాలు, వృత్తి భద్రత, ఇళ్ల స్థలాలు వంటి అంశాలపై క్రమబద్ధమైన ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. 'చక్రవర్తి సుపరిచితుడే' అంటూ పువ్వాడ నాగేశ్వరరావు వ్యక్తం చేసిన ఆత్మీయత తమకు మరింత ఉత్సాహం, ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ నాగేశ్వరరావు టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తికి పూర్తి భరోసా ఇస్తూ, జర్నలిస్టుల హక్కుల పోరాటంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పునరుద్ఘాటించారు. అవసరమైన ప్రతి వేదికపై జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావిస్తానని, భావజాల భేదాలు పక్కనపెట్టి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ మర్యాదపూర్వక భేటీ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్- 2843) జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, మందడపు మనోహర్, వేల్పుల నాగేశ్వర రావు, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, కార్యవర్గ సభ్యులు అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కందరబోయిన నాగకృష్ణ, సుదగాని కరుణాకర్, పొదిలాపు సంతోష్, ఎలుగోటి వెంకట్, గంటేల కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మల్లెల శిల్పా, నాయిని స్వాతి, వంగ పుంగమ గౌడ్, చిన్నంశెట్టి రాంబాబు, మామిడాల వీరబాబు, షేక్ సోందుమియా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ భేటీ జర్నలిస్టు ఉద్యమాలకు కొత్త ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సమిష్టిగా, ఉద్యమాత్మకంగా ముందుకు సాగుతామని టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) నేతలు స్పష్టం చేశారు.

# నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు

### డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

### 13 వేల 500 కోట్లతో 96 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ

### 10 కోట్ల 53 లక్షల రూపాయల అంచనాతో చేపట్టిన మూడు 33/11 కె.వి. సబ్ స్టేషన్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సిఎం









**తల్లాడ, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతులకు, ప్రజలకు పారిశ్రామికవేత్తలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం తల్లాడ మండలం పినపాక, అన్నారుగూడెం, కల్లూరు మండలం లింగాల గ్రామాల్లో 10 కోట్ల 53 లక్షల రూపాయల అంచనాతో చేపట్టిన మూడు 33/11 కె.వి. సబ్ స్టేషన్ ల నిర్మాణ పనులకు ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్ లతో కలిసి పినపాక గ్రామంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా సబ్ స్టేషన్ లను నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే అందించిన ప్రతిపాదన మేరకు తల్లాడ మండలం పినపాక, అన్నారుగూడెం, కల్లూరు మండలం లింగాల మూడు గ్రామాల్లో సబ్ స్టేషన్ లు మంజూరు చేసుకుని వాటి నిర్మాణ పనులకు భూమి పూజ చేసుకున్నామని తెలిపారు. తల్లాడ, కల్లూరు మండలంలో ఉన్న రైతులకు, రైతు కూలీలకు, సామాన్యులకు ఎవరికైనా విద్యుత్ చాలా కీలకమని అన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉంటే మంచి పంటలు పండుతాయని, సబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని , సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 55 వేల 588 కుటుంబాలకు గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటివరకు పేదలు, రైతుల తరపున 123 కోట్ల రూపాయలను విద్యుత్ సంస్థకు చెల్లించడం జరిగిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని, దీని ఫలితంగా ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో తాము గెలుపొందామని డిప్యూటీ సీఎం తెలిపారు. గతంలో ప్రతిపక్షం తరపున తాను ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా అప్పటి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందని, ఒక రోజు కూడా సభకు గైర్హాజరు కాలేదని, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా తన కర్తవ్యాన్ని నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని డిప్యూటీ సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం పాటించిన విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో ధ్వంసమైనప్పటికీ ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు 26 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని అన్నారు. 96 లక్షల కుటుంబాలకు 13 వేల 500 కోట్లు ఖర్చు చేస్తూ నాణ్యమైన సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను గత పాలకులు మోసం చేస్తే, మన ప్రజా ప్రభుత్వం 22 వేల 500 కోట్లు ఖర్చు చేస్తూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 ఇండ్ల చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. పేద ప్రజలు ఆత్మ గౌరవంతో ఉండేలా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం రైతుల పక్షాన 12 వేల 500 కోట్ల రూపాయలు రైతుల తరపున విద్యుత్ శాఖకు చెల్లిస్తూ 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నా మని, నిరుపేదలకు రేషన్ కార్డులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, దీనిని గమనించిన ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ విషం కక్కుతున్నారని, దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద ప్రజలకు గృహ అవసరాల కోసం 200 యూనిట్లు, రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం 24 గంటలు, ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నామని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రావద్దని 33/11 కేవీ సబ్ స్టేషన్ లను నిర్మిస్తున్నామని అన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకొబ్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, అధికారులు, పాల్గొన్నారు.

# రైతులను సన్మానించిన బ్యాంక్ అధికారులు




**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని హసన్ పర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలోని రైతులను బ్యాంక్ మేనేజర్ సకులాల్ లకావత్ కార్తీక్ సన్మానించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులకు అభివందనమని పేర్కొన్నారు. ప్రతి రైతు దేశానికి గర్వకారణమని, రైతులు ఉత్పత్తి దారుల నుండి నుండి వ్యవస్థాపకులుగా మారాలని కోరారు. బ్యాంక్ అందిస్తున్న కిసాన్ సమృద్ధి పథకం, దీర్ఘ, స్వల్పకాలిక పంట రుణాలు గురించి వివరించారు సకాలంలో రుణాలను చెల్లించి నట్లయితే కలిగే ప్రయోజనాలను పేర్కొన్నారు. రుణం తీసుకొని మరణించిన రైతుల రుణ విముక్తి విదానాలను వివరించారు. బ్యాంకుల అందిస్తున్న వివిధ రుణ సదుపాయాల ను పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో బ్యాంకు పరిధి లోని ఎనిమిది గ్రామాల నుండి 50 మంది రైతులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ స్కూల్‌లో ఘనంగా గణిత దినోత్సవం





**కల్లూరు, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విజ్ఞాన్ విద్యానికేతన్ కల్లూరు పాఠశాల లో గణిత శాస్త్రవేత్త శ్రీనువాస రామానుజం జయంతి సందర్భంగా జరిపే జాతియ గణిత దినోత్సమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ప్రత్తిపాటి నివేదిత ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు చేసిన గణిత ఎక్స్ పో, వర్కింగ్ మెడల్స్, ఛార్ట్ ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను అభినందించి గణిత శాస్త్ర గొప్పతనాన్ని వివరించారు. జాతీయ అవార్డ్ గ్రహీత పేరువంచ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాలిని ఎంఈఓ ప్రత్తిపాటి నివేదిత పాఠశాల కరస్పాండెంట్ ఎస్.కె ఇస్మాయిల్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కుటుంబానికి ప్రగాఢ సంతాపం



**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం లోని 66 వ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీ లోని బొక్క కుమార్ తండ్రి పరమావధించిన సందర్భంగా వారిని కలిసి పరామర్శించిన తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్. ఈ సందర్భంగా బొక్క కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా దళిత బహుజన ఉద్యమాలలో కీలక పాత్ర పోషించి బడుగు బలహీన నిరుపేద వర్గాల పేద ప్రజల కోసం అహర్నిషలు కృషి చేసిన కుమార్ తండ్రి మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియ చేశారు. తెలంగాణ అంబేత్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్ , బోడ యుగంధర్, బొక్క కిషన్, మ్యాక రమేష్, పొన్నాల వినోద్ కుమార్ వేముల జగదీష్ పాల్గొన్నారు.

## మంత్రి క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు




**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ 'ఓ' సిటీ లోని మంత్రి క్యాంప్ కార్యాలయ ఆవరణలో మంగళవారం క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ముకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖా మాత్యులు కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. తన స్వంత ఖర్చుతో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఫాస్టర్లందరికి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆర్డీఓ సుమ, కార్పొరేటర్లు భోగి సువర్ణ, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, పోశాల పద్మ, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమి శెట్టి ప్రవీణ్ కుమార్, ఫుర్ఖాన్, ఫాస్టర్లులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### వ్యక్తిగత గోప్యత చాలా అవసరం: సైబర్ క్రైమ్ ఏసిపి సిహెచ్.ఆర్.వి ఫణిదర్



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశంలో సైబర్ క్రైమ్‌లు రోజు రోజుకూ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని సైబర్ క్రైమ్ ఏసిపి సిహెచ్.ఆర్.వి ఫణిదర్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'సైబర్ క్రైమ్ ఏసిపి సిహెచ్.ఆర్.వి ఫణిదర్ తో మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సైబర్ నేరాలపై ఏసీపీ విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్నెట్, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల ద్వారానే ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. ఆన్లైన్లో కష్టపడకుండా డబ్బులు రావాలి, తక్కువ టైంలో ధనవంతులం కావాలి అని ఆశపడేవారు సైబర్ క్రైమ్ కు గురవుతారన్నారు. శ్రమలేని డబ్బు సంపాదన ప్రాడేనన్నారు. ఆన్లైన్లో అప్లికేషన్ ఫిల్ చేయడం, తెలియని మ్యాట్రిమోనీకి ఫోటోలుతో సహా పూర్తి వివరాలు ఇవ్వడం ద్వారా కూడా సైబర్ క్రైమ్ జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో ఆధార్ కార్డుతో తీసుకున్న నీ సిమ్ కార్డు పై వేరేవాళ్లు వాడి నేరం చేశారని ఆకేసు మీ మీద పడిందని భయపెట్టి ఒంటరిగా మాట్లాడాలని, డబ్బులు ఇస్తే క్రైమ్ జరగకుండా చూస్తానని చేసేవి సైబర్ క్రైమ్ లే అన్నారు. ఇలా చదువుకున్న వారు, ఉద్యోగులు, వ్యాపారులు కూడా సైబర్ మోసాలకు గురవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఫేక్ లింకులు, ఫిషింగ్ మెసేజ్‌లు, లాటరీలు, ఉద్యోగాలు, బహుమతుల పేరిట ఆశ చూపిస్తూ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలను దొంగిలిస్తున్నారని ఏసిపి వివరించారు. అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, తెలియని యాప్లను డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ముఖ్యంగా ఓటిపి, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఎవరికీ చెప్పకూడదని, తాము బ్యాంక్, పోలీస్ ల ప్రభుత్వ అధికారులమని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడమే సైబర్ నేరాల నుంచి రక్షణ పొందడానికి ప్రధాన ఆయుధమని తెలిపారు. సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలాగే సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉందని వివరించారు. ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగితే డబ్బు లేదా డేటాను తిరిగి పొందడం కష్టమవుతుందని చెప్పారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ తరపున పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మీడియా కూడా ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలని ఏసిపి ఫణిదర్ కోరారు. సైబర్ నేరాలపై సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం ద్వారా అనేక మోసాలను నివారించవచ్చని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పోలీస్ స్టేషన్ లో సైబర్ వ్యక్తులను ఏర్పాటు చేశామని, 7 లక్షల లోపు సైబర్ క్రైమ్ అయితే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, ఏడు లక్షలు దాటి సైబర్ క్రైమ్ జరిగితే సైబర్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఫేక్ కాల్స్ వస్తే భయపడకుండా, అనవసర కాల్స్ కి స్పందించకుండా ఒక్క నిమిషం ఆగి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# పాఠశాలలకు వైన్ షాపులు అతి దగ్గర ఉండకూడదు



**చిట్యాల డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో వైన్ షాపులు. అతి దగ్గరలో ఉన్న సందర్భంగా కళాశాలలు మరియు పాఠశాలలకు విద్యార్థులను మద్యపానానికి బానిసలు చేస్తున్న సందర్భంగా (తెలంగాణ ఎజఖ యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ చిట్యాల మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్లో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు రవి పటేల్ మరియు రాష్ట్ర నాయకులు వరంగల్ పార్లమెంట్ కాంటెస్ట్ ఎంపీ అభ్యర్థి ఎస్పికె సాగర్ మరియు TRP యూత్ జిల్లా అధ్యక్షులు బండి సునిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ విచ్ఛిన్నమైంది అలాగే స్థానిక మండల కేంద్రంలో సుమారు కిలోమీటర్ దూరం ఉండవలసిన వైన్ షాపులు ఊరు సెంటర్లో ఉండడం వల్ల కాలేజీకి రావాల్సిన విద్యార్థులు మద్యపానానికి అలవాటై జీవితాలను నాశనం చేసుకుంటా ఉన్నారు అలాగే విద్యకు కూడా దూరం అవుతున్నారు కావున తక్షణమే జిల్లాలో మరియు చిట్యాల మండల కేంద్రంలో ఉండబడిన వైన్ షాపులను ఊరుకు దూరంగా తొలగించి విద్యార్థుల జీవితాలను కాపాడాలని మరియు వైన్ షాప్ అనుముతులపై నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నటువంటి ఎక్సైజ్ శాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే గారు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీధర్ విష్ణు మహేష్ కుమార్.కిట్టు సిద్దు చింటూ.మహేష్ విద్యార్థి విద్యార్థులు విద్యార్థినీలు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనాలకోట రామారావు

### జిల్లాలో ఈ నెల 22 నుండి ప్రారంభం

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాల విద్యార్థుల కంటి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనాలకోట రామారావుఅన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ సహాయ పాఠశాలలు, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, సామాజిక సంక్షేమ, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, మదర్సాలు, ఇతర విద్యాసంస్థల్లో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షల కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చూపు లోపాలు, దృష్టి సంబంధిత సమస్యలను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సలు అందించడం జరుగుతుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈ కంటి పరీక్షల కార్యక్రమం అమలు చేయబడుతుందని పేర్కొన్నారు. కంటి పరీక్షలను పారా వైద్య కంటి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనుండగా, పిల్లల ఆరోగ్య పరీక్షల బృందాలు సహకరించనున్నాయి. ప్రతి బృందానికి ఇద్దరు ఆశా కార్యకర్తలు సహాయంగా వ్యవహరించనున్నారు. రోజుకు సగటున రెండువందల యాభై నుంచి మూడు వందల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బృందాల రాకపోకల కోసం వాహన సౌకర్యం కూడా కల్పించబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ఈ నెల ఇరవై రెండవ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కంటి పరీక్షల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించి నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తెలియజేసింది. డాక్టర్ డి.రాములు నాయక్, హెచ్.ఓ.డి. ఆప్తమాలజీ, డాక్టర్ వేణు మాధవరావు డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. పర్యవేక్షణ



చేస్తారని తెలిపారు. ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సర్పంచ్‌గా పూడుగుల వెంకన్న అను నేను...

### గ్రామప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడతా...

### - చిలుకోయలపాడులో వేద మంత్రాల సాక్షిగా నూతన సర్పంచ్ గా పూడుగుల వెంకన్న ప్రమాణ స్వీకారం

### - సర్పంచ్ వెంకన్నను సన్మానించిన గ్రామ ప్రజలు, పెద్దలు



**సీరోలు, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చిలుకోయలపాడులో నూతన సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టినున్న పూడుగుల వెంకన్న ప్రమాణ స్వీకారానికి గ్రామ ప్రజలు అందరూ తరలివచ్చారు. చిలుకోయలపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్ గా ప్రమాణ స్వీకార మహోత్సవానికి సోమవారం పంచాయతీ సెక్రెటరీ దగ్గరుండి అన్ని కార్యక్రమాలు పూర్తి చేశారు. స్పెషల్ ఆఫీసర్ శాంతి నూతనంగా ఎన్నుకకాబడిన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను గ్రామ ప్రజలు, అధికారులు ముందు చట్టాలకు, శాసనాలకు లోబడి పని చేస్తానని ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వేదమంత్రాలు నడుమ సర్పంచ్ సీటు స్థానంలో వార్డు సభ్యులు, అధికారులు ముందు పూడుగుల వెంకన్నను ఆసీనులను చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూడుగుల వెంకన్న మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి నన్ను గెలిపించిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విజయం గ్రామ ప్రజల సమిష్టి ఆకాంక్షల ప్రతిబింబంగా భావిస్తున్నానన్నారు. గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత రహదారుల అభివృద్ధి, మంచి విద్యుద్దీకరణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఇకనుండి ప్రజల ఆకాంక్ష మేరకు చిలుకోయలపాడు గ్రామంలో కొత్త పాలన కొనసాగుతోందని తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూడుగుల నాగరాజు, పారేపల్లి వాల్మీకి, ఓర్రే మౌనిక, మేకల సమత, తేజావత్ మంగ్య, పొన్నం వీరన్న, మేకల రజిత, నాగటి వెంకటేష్, పసులది సుగుణ, రాయబారపు పరుశురాములు, ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌యు ఎన్‌ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వ్యవసాయ, రైతు సాధికారత కార్యక్రమం






**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎస్ ఆర్ యు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బావోపేట్ గ్రామంలో స్థిరమైన వ్యవసాయ అవగాహన, రైతు సాధికారత కార్యక్రమంబావోపేట్ గ్రామం, 23 డిసెంబర్ 2025పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, రైతు సాధికారత మరియు స్థిరమైన గ్రామీణ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ఎస్ ఆర్ యు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ బావోపేట్ గ్రామంలో మంగళ వారం "స్థిరమైన వ్యవసాయ అవగాహన రైతు సాధికారత కార్యక్రమం"ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బావోపేట్ గ్రామ సర్పంచ్ బి. రవిందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో రైతులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు, పరస్పర చర్చలపై ఆసక్తి చూపించారు. కార్య క్రమంలో భాగంగా క్రింది అంశాలతో వ్యవసాయ ప్రదర్శన (ఎగ్జిబిషన్) ఏర్పాటు



చేయబడింది:సేంద్రీయ వ్యవసాయం మరియు దాని ప్రయోజనాలపై అవగాహనప్రత్యక్ష ప్రదర్శనలతో ఆరోగ్యం, మట్టి పరీక్ష శిబిరం నీటి సంరక్షణ మరియు ఆధునిక సాగునీటి పద్ధతులుస్థిరమైన ఆదాయానికి పంటల వైవిధ్యంప్రత్యక్ష నమూనాలతో వర్మీకం పోస్టింగ్ శిక్షణస్మార్ట్ ఫార్మింగ్ సాధనాలతో ఆధునిక వ్యవసాయ పద్ధతులు నిజ జీవిత అనుభవాల పంచకానికి రైతు పరస్పర చర్చా కార్యక్రమం రసాయన రహిత ఆహారంపై అవగాహన ర్యాలీగృహ పోషణ కోసం కిచెన్ గార్డెన్ కార్యక్రమంవాతావరణ మార్పులు మరియు వ్యవసాయంపై వాటి ప్రభావం విత్తనాల పంపిణీ, అవగాహన కార్యక్రమంరైతులు వాలంటీర్లతో చురుకుగా పరస్పరం చర్చించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన నమూనాలు, చార్టులు మరియు అవగాహన సామగ్రిని వారు ప్రశంసించారు. గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ రసాయన రహిత ఆహారం మరియు స్థిరమైన వ్యవసాయం గురించి బలమైన సందేశాన్ని ప్రజల్లో వ్యాప్తి చేసింది.సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన సర్పంచ్ బి. రవిందర్, గ్రామ స్థాయిలో ఇలాంటి అర్థవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ ఆర్ యు ఎన్ ఎస్ ఎస్ యూనిట్‌ను అభినందిస్తూ, రైతుల సంక్షేమం మరియు భవిష్యత్ తరాల కోసం స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాల్సిన అవసరాన్ని వివరించారు.కార్యక్రమం చివరలో కృతజ్ఞతా తీర్మానం నిర్వహించబడింది. సమాజ సేవ, రైతు సాధికారత మరియు స్థిరమైన గ్రామీణ అభివృద్ధి పట్ల ఎస్ ఆర్ యు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది.

# 28న మహిళా చైతన్య దీప్తి 'ఓల్గా'కు పౌర సన్మానం

### ● మీడియా సమావేశంలో నిర్వాహకురాలు సుమతి




**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈ నెల 28న ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ సాహితీవేత్త, కవయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమి మహిళా అవార్డు గ్రహీత, ఓల్గాకు పౌరసన్మానం, అభినందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్వేచ్ఛావరణం నిర్వహకురాలు సుమతి తెలిపారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కార్యక్రమ వివరాలను వివరించారు. ఈ అభినందన కార్యక్రమానికి ప్రముఖ సాహితీ వేత్తలు మృణాళిని, కాత్యాయని విద్మహే, ప్రతిమ, పాటిబండ్ల రజని హాజరు కానున్నట్లు తెలిపారు. తొలుత 'ఓల్గా తీరం' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 'ఓల్గా' రచనలపై ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అతిథుల సందేశాల అనంతరం ఓల్గా రచనలతో కూడిన నృత్యరూపకాన్ని ప్రదర్శించనునట్లు తెలిపారు. ఇప్పటికే ఓల్గా రచనలపై పలు కాలేజీల విద్యార్థులకు పోటీలు నిర్వహించామని, విజేతలకు పుధ్యాహ్నం తర్వాత బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఖమ్మంలోని అన్ని సాహితీ సంస్థలు సహకరిస్తున్నాయని తెలిపారు. అన్ని రంగాల్లోని మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. సమాజం కోసం నిరంతరం సేవ చేస్తున్న ఓల్గా 75వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నాం









**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**గ్రీన్ ఎనర్జీ రంగం వైపు సింగరేణి విస్తరణకు చర్యలు**

**ఎర్త్ మినరల్స్, క్రిటికల్ మినరల్స్ మైనింగ్ వైపు దృష్టి సారించాలి**

**సింగరేణి కాలరీస్ కంపెనీ నూతన జి.ఎం. కార్యాలయ భవనాన్ని ప్రారంభించి, జెవిఆర్ ఓపెన్ కాస్ట్ మైన్‌ను పరిశీలించిన డిప్యూటీ సిఎం**

**సత్తుపల్లి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రపంచంతో పోటీ పడేలా సింగరేణి సంస్థను తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు సింగరేణి కాలరీస్ కంపెనీ నూతన జి.ఎం. కార్యాలయ భవనాన్ని సింగరేణి సంస్థ సి.ఎం.డి. కృష్ణ భాస్కర్, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 137వ సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కార్మికుల మధ్య జరుపుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ నూతన జీఎం కార్యాలయం విశాలంగా నిర్మించుకొని నేడు ప్రారంభించామని అన్నారు. సింగరేణి సంస్థ నేడు 45 వేల శాశ్వత ఉద్యోగులు, 40 వేల కాంట్రాక్టు ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిందని అన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేస్తూ ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు సింగరేణి సంస్థ కృషి చేస్తున్నదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న విద్యుత్ కేంద్రాలు బొగ్గు వాడుకోవడం కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా మనం సరఫరా చేస్తున్నామని, విద్యుత్ ఉత్పత్తికే కాకుండా వ్యాపార అవసరాలకు కూడా మనం బొగ్గును సరఫరా చేస్తున్నామని అన్నారు. బొగ్గు ఉత్పత్తి కంపెనీలు గతంలో ప్రభుత్వ పరంగానే ఉండేవని, కాలక్రమేణ వచ్చిన మార్పులతో ప్రైవేట్ సంస్థలకు కూడా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. బొగ్గు మైన్స్ ఆక్షన్ లో ప్రైవేటు సంస్థలు కూడా పాల్గొంటున్నాయని, విదేశాల నుంచి కూడా బొగ్గు దిగుమతి చేసుకునే అవకాశం ఉన్నందున పెరిగిన పోటీలో సింగరేణి కాలరీస్ కూడా తట్టుకొని నిలబడాలని అన్నారు. నాణ్యమైన బొగ్గును మార్కెట్ ధరకు సరఫరా చేయాలని, పోటీని తట్టుకునేలా సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి నాణ్యత పెంచుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. సింగరేణి సంస్థకు మైనింగ్ లో ఉన్న ప్రావీణ్యం మరెవరికి ఉండదని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బొగ్గు తవ్వకాల్లకే పరిమితం కాకుండా సింగరేణి సంస్థ మరిన్ని రంగాలలో రాణించాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచాలని ప్రభుత్వం పాలసీలు రూపొందిస్తున్నాయని అన్నారు. ప్రపంచీకరణలో వస్తున్న మార్పులను సింగరేణి కాలరీస్ సంస్థ అలవర్చుకోవాలని, రేర్ ఎర్త్ మినరల్స్, క్రిటికల్ మినరల్స్ మైనింగ్ వైపు దృష్టి సారించాలని అన్నారు. గ్లోబల్ స్థాయికి ఎదిగాలని, ప్రపంచ వ్యాప్తంగా సింగరేణి జెండా ఎగరాలని డిప్యూటీ సీఎం అన్నారు. సింగరేణి విస్తరణ ప్రపంచ వ్యాప్తంగా జరిగేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపించాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అన్నారు. సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గు బ్లాకులపై కేంద్ర ప్రభుత్వం ఆక్షన్ విధిస్తే బయట ఎవరి చేతిలోకి పోకుండా కట్టుదిట్టమైన ప్రణాళిక అమలు చేస్తున్నామని అన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా సింగరేణి అడుగు పెట్టిందని, ప్రయోగాత్మకంగా ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్ కూడా నిర్మిస్తామని, రాజస్థాన్ ప్రభుత్వంతో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సింగరేణి ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు డిప్యూటీ సీఎం తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. సత్తుపల్లి ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను సింగరేణి సంస్థ సిఎస్ఆర్ క్రింద చేపడుతుందని, నాణ్యమైన బొగ్గు అధిక దిగుబడినిచ్చే సత్తుపల్లి ప్రాంతం నుంచి వస్తుందని అన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన కిష్టారం, వెంగళరావు నగర్, ఎన్టీఆర్ కాలనీ తీవ్ర కాలుష్యంతో ప్రజలు శ్వాస కోస ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ ఇండ్లు కోల్పోయిన 40కుటుంబాలకు నూతన ఇల్లు నిర్మించామని, మరో 200 ఇండ్లు నిర్మించాల్సి ఉంటుందని అన్నారు. కిష్టారం గ్రామ ప్రజలకు ఆర్%ఒ%ఆర్ ప్యాకేజీ అందించి మరో చోటుకు తరలించాలని అన్నారు. అంతకుముందు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని డిప్యూటీ సీఎం కేక్ కట్ చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం జివిఆర్ ఓపెన్ కాస్ట్ మైన్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, సింగరేణి అధికారులు, వివిధ శాఖల అధికారులు,పాల్గొన్నారు.

# కిట్స్‌లో బహుళజాతి కంపెనీలలో క్యాంపస్ ప్లేస్మెంట్




**30 కంపెనీలు తమ ఎంపికైన వారికి సంవత్సరానికి రూ. 5 లక్షల నుండి 15.5 లక్షల వరకు సిటీసి**

**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 2025-2026 విద్యా సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో 50 కి పైగా బహుళజాతి అగ్రశ్రేణి ఐటీ మరియు కోర్ ఇంజనీరింగ్ కంపెనీలలో బి.టెక్ విద్యార్థుల క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లు 317o మార్కును చేరుకున్నాయని ఫార్మర్ రాజ్యసభ, యం.పి. కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, చైర్మన్, కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (కిట్స్) వరంగల్ వారు ఒక ప్రెస్ నోట్ లో తెలిపారు. ఈ ప్రస్తుత సెమిస్టర్ కోసం, ఎల్ టి ఐ మైండ్ ట్రీ, ఒరాకిల్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, టీ టి ఈ సి, చబ్బ్, ఈ డబ్ల్యుజిసిఎస్, రియల్ పేజ్, హెక్సావేర్ టెక్నాలజీస్, డెక్సారా, అశోక బిల్డర్స్, నార్తర్న్ టూల్స్, మేధా సర్వోడ్రైవ్స్, టిసిఎస్ మరియు టెక్నిపిఎఫిఎంసి వంటి ప్రఖ్యాత ఎంఎన్సి లు ప్రస్తుత చివరి సంవత్సరం బి.టెక్. మరియు యం. టెక్. చదువుతున్న విద్యార్థుల నుండి మొత్తం 317 మందిని ఎంపిక చేసుకున్నాయి. రాబోయే రోజుల్లో కిట్స్ ప్రాంగణ నియామకాల నిర్వహణకు సాంకేతిక ప్రపంచ దిగ్గజ యమ్. యన్. సి. కంపెనీలు సంసిద్ధత వ్యక్తం, కోశాధికారి పి. నారాయణ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులకు సగర్వంగా హైలైట్ చేశారు. క్యాంపస్ ప్లేస్ మెంట్‌లను నిర్వహించడానికి అనేక కంపెనీలు పైప్ లైన్‌లో ఉన్నాయి. ప్రస్తుత బి.టెక్. చివరి సంవత్సరం విద్యార్థులు ఇంటర్వ్యూల ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. అధిక ప్లేస్‌మెంట్‌లను పొందడానికి స్థిరమైన అభ్యాసం మరియు వారి అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యం అని తెలిపారు. విద్యార్థులు తమ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నెమరు వేసుకుంటూ ఉద్యోగ సముపార్జన లో నిమగ్నము కావాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి కోరారు. ఈ సాఫ్ట్వేర్ కంపెనీ వారు వ్రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, ఇంటర్వ్యూ రౌండ్ లను విజయ వంతంగా 3 దశలలో నిర్వహించారు . ప్రస్తుత బి.టెక్. చివరి సంవత్సరం 2025-2026 బ్యాచ్ కి చెందిన సి ఈ, యంఈ, సి యస్ యం, సి యస్ ఈ, సి యస్ యన్, సి యస్ ఓ, ఐ టి, ఈ సి ఈ, ఈ సి ఐ, ఈఈఈ వంటి 10 బ్రాంచ్ ల 317o మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక అయ్యారు అని తెలిపారు. సంస్థ తమ పని తీరును మెరుగు పరచు కోవడానికి మరియు వారి కీలక వాటా దారులకు స్థిరమైన విలువను సృష్టించడానికి సంస్థలకు సహాయం చేస్తుంది. ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (సి- ఐ స్క్వేర్ అర్ ఈ) కార్య కలాపాల పై దృష్టి సారించే పాఠ్యాంశాల ఆధారంగా బోధన అందించడం, ఇది నిరంతరం తాజా సాంకేతిక సాధనాలతో సమలేఖనం చేయబడిందని కూడా ఆయన హైలైట్ చేశారు. కిట్స్ కళాశాల యాజమాన్యం సభ్యులు, ఫార్మర్ రాజ్యసభ, యం.పి, కిట్స్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంతా రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి, హుస్నాబాద్ నియోజక వర్గ ఎమ్మెల్యే, వి. సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, డీన్ ట్రైనింగ్ ప్లేస్ మెంట్స్ ప్రొఫెసర్ వై. పురందర్, టి.పి.ఓ. డా. టి. చంద్రబాయి, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ ఇ. కిరణ్ కుమార్, వివిధ విభాగాల డీన్స్, విభాగాదిపతులు మరియు కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ పి. ఆర్.ఓ. డా.డి. ప్రభాకరా చారి, ఆప్టిట్యూడ్ ట్రైనర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జి. ధనుష్, డి శరత్, పి. సింధూర, పి. అరుణ కుమారి వివిధ విభాగాల హెడ్‌లు, అందరు డీన్‌లు, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది ఎంపికైన 317o విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు




**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** క్రిస్మస్ పండగను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, డిటిఓ శ్రీనివాస్ కుమార్ పాల్గొని సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, మానవత్వం, ప్రేమ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ఈ పండుగ గుర్తుచేస్తుందని వారు పేర్కొన్నారు. క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ ఈజీఎస్ సెర్ప్, సూపరిండెంట్లు, డీపీఎంలు, ఏపీఎంలు తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా 25న నగరంలో టు కే రన్




**జనవరిలో కవితా సంకలనం ఆవిష్కరణ**

**ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరు, మందడపు పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మాజీ ప్రధానమంత్రి, దీన్ దయాల్ సిద్ధాంతకర్త అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 25న ఖమ్మంలో టుకె రన్ నిర్వహించనున్నట్లు ఉత్సవాల కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వాయిపేయి జీవితం, రచనలు, పాలనపై ఒక కవితా సంకలనం తీసుకురానున్నామని తెలిపారు. ఈ కవితా సంకలనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి 160 వుంది కవులు స్పందించి కవితలు పంపించారని, త్వరలోనే ఆవిష్కరణ చేయనున్నామని తెలిపారు. జయంతి ఉత్సవాల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించ తలపెట్టామన్నారు. సమాజానికి ఒక శక్తివంతమైన స్ఫూర్తినిచ్చే ప్రదాతగా వాజ్‌పేయి ప్రధానమంత్రిగా తన బాధ్యతలను నిర్వహించడమే కాక తాను నమ్మిన సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ఆదరణ పొందారని అన్నారు. అలాంటి నేతను ఆదర్శంగా తీసుకొని ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలనే ఆలోచనలతో తాము ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను అన్ని రాజకీయ పార్టీలను, పలు స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని ఈ కార్యక్రమాలు చేపడతామన్నారు. రేపు ఖమ్మంలో టూ కే రన్‌ఈ నెల 25న గురువారం ఉదయం పటేల్ స్టేడియం నుండి జెడ్పీసెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దుద్దుకూరి తెలిపారు. ప్రజలందరూ భాగస్వాములై అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘనంగా నివాళు లర్పించాలన్నారు. అనంతరం ఐఎంఏ హాల్‌లో వాజ్‌పేయి సమకాలీకులను సన్మానించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో భాగంగా వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేయనున్నామన్నారు. వారితోపాటు నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేసి ఆ మేరకు వారిని ఆదుకోవాలని ఆలోచన చేసినట్లు తెలిపారు. ఆరోగ్యపరంగా ప్రజలకు వైద్య సేవలు అందించాలని దృక్పథంతో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నామన్నారు. నూతన సంవత్సరం జనవరిలో తలపెట్టిన అటల్ బిహారీ వాజ్పేయి కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. అందుకోసం తమ కవిటీ ఏర్పాట్లలో ఉందన్నారు. జనవరిలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలందరూ తమకు సహకరించి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు వడ్లమూడి సురేష్, కోశాధికారి మల్లెంపాటి రమేష్ పాల్గొన్నారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు

**హన్మకొండ,డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ క్యాథలిక్ డయాసీస్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ దుగ్గెంపూడి విజయ పాల్ రెడ్డిని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫాదర్ విజయపాల్ రెడ్డికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ విజయ పాల్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు మార్క విజయ్, ఫాదర్ కె. జోసెఫ్, ఫాదర్ అను కిరణ్, ఫాతిమా కేథడ్రల్ చర్చ్ ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణ పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష

**కడప, డిసెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం రాత్రి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.. జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యమైన రుచి, శుచికరమైన పద్ధతులు పాటించడం, పారిశుద్ధ్య మెరుగుపై అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, ఎంపీడీవోలు లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించడం జరిగింది. అనంతరం జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణ పురోగతిపై నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కడప నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి, డీఈవో శంషుద్దీన్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, సిపిఓ హజరతయ్య, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.